క్లుప్తంగా

రేపు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ సమావేశం

అనపర్తి: రంగంపేట మండలంలోని ఈలకొలను గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, అనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్‌ సత్తి సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తరలిరావాలని కోరారు.

ఘనంగా సాయిబాబా గ్రామోత్సవం



బిక్కవోలులో సాయిబాబా గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బిక్కవోలు: గ్రామంలోని కోదండ రామాలయం వద్ద గల సాయిబాబా ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైజాగ్‌ అబ్బు, పాలచర్ల రామకృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

13న పార్వతీ దేవికి సారె సమర్పణ

బిక్కవోలు: బలభద్రపురంలో కొలువైన పార్వతీ దేవికి ఆదివారం సారె సమర్పిస్తామని నిర్వాహకుడు కొవ్వూరి ప్రసాద్‌ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9 గంటలకు శివాలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి వేణుగోపాలస్వామి దేవాలయానికి చేరుకుంటామన్నారు. అక్కడ నుంచి గ్రామోత్సవంగా శివాలయం వద్దకు వెళతామన్నారు. మహిళలు తమ శక్తి కొలదీ పసుపు, కుంకుమ, స్వీటు తీసుకుని గ్రామోత్సవంలో పాల్గొనాలని కోరారు.

వెంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు

కోరుకొండ: కోరుకొండ బస్టాండ్‌ సమీపంలోని భూసమేత వేంకటేశ్వరస్వామికి శుక్రవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్‌ పసుపులేటి రెడ్డమ్మ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రం కావడంతో అర్చకుడు విరియాల శేషు పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, కార్యక్రమంలో పాల్గొన్నారు.

14 నుంచి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రామ్‌

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 14 నుంచి 19 వరకూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రామ్‌ జరుగుతుందని వీసీ ఆచార్య ఎస్‌.ప్రసన్నశ్రీ తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 'క్వాంటం టెక్నాలజీస్‌ ఆపర్చునిటీస్‌ అండ్‌ థ్రెట్స్‌' అనే అంశంపై ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కో ఆర్డినేటర్‌గా డాక్టర్‌ వి.పెర్సిస్‌, అసిస్టెంట్‌ కో ఆర్డినేటర్‌గా డాక్టర్‌ జి.కీర్తి వ్యవహరిస్తారు.

ఆగస్టు 15 లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

పెదపూడి: ఖరీఫ్‌ 2025కు సంబంధించి రైతులు ఆగస్టు 15లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఎ.సత్యప్రసాద్‌ తెలిపారు. ఆయన శుక్రవారం పెదపూడిలో మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్‌ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై) పథకంలో వరి పంట ఎకరానికి రూ.769.23 ప్రీమియాన్ని రైతులతో కట్టించాలన్నారు. తద్వారా తుపానులు, కరవు, అకాల వర్షాలు తదితర ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు.

ఎరువుల యాజమాన్యంపై అవగాహన



వెలుగుబందలో వరిసాగు క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రాజానగరం: ఖరీఫ్‌ వరిసాగులో చేపట్టాల్సిన ఎరువుల సమగ్ర యాజమాన్యంపై రైతులను చైతన్య పరుస్తూ దివాన్‌ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్‌ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్‌ మానుకొండ శ్రీనివాస్‌ శుక్రవారం పలు ప్రాంతాలలో పర్యటించారు. అక్కడి వరి సాగు క్షేత్రాలను పరిశీలించారు. కొవ్వూరు, అనపర్తి మండలాలతో పాటు నియోజకవర్గంలోని వెలుగుబంద, దోసకాయలపల్లి, వేములూరులలో రైతులను కలుసుకున్నారు. నారుమడి నుంచి పంట కోత వరకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువులు, పురుగు మందుల వినియోగంపై అవగాహన కల్పించారు.

ముమ్మరంగా ఖరీఫ్‌

- సాగు పనుల్లో రైతులు బిజీ
- నీటి సదుపాయాలున్నచోట నాట్లు పూర్తి



వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

రాజానగరం: నియోజకవర్గంలో ఖరీఫ్‌ వరి సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సాగునీటి సదుపాయాలున్న ప్రాంతాలలో వరి నాట్లు వేయడం దాదాపు పూర్తి కావొస్తుంటే, మిగిలిన ప్రాంతాలలో కాస్త నెమ్మదిగా నాట్లు వేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో మెట్ట ప్రాంతంలోని రాజానగరం మండలం నరేంద్రపురం, తూర్పుగానుగూడెం, కలవచర్ల, వెలుగుబంద గ్రామాలలో రైతులు వరి నార్లు వేసి, నాట్లు వేయడంలో ముందంజలో ఉన్నారు. మిగిలినచోట్ల నార్లు వేయడంలో ఆలస్యం కావడంతో నాట్లు పడటంలో కూడా జాప్యం జరుగుతోంది.

బెంగాలీ కూలీల హవా

గత కొన్ని సంవత్సరాలుగా వరినాట్లు వేయడంలో స్థానికంగా ఎదురుతున్న కూలీల కొరతను బెంగాలీ కూలీలు చాలా వరకూ తీరుస్తున్నారు. ఈసారి కూడా ఖరీఫ్‌ వరి సాగులో వారి హవా కొనసాగుతోంది. స్థానికంగా రోజు వారీ పనులకు ఆడవారికి రూ.400, మగవారికి రూ.600 నుంచి రూ.700 కూలి చెల్లించాల్సి వస్తోంది. అదే బెంగాలీ కూలీలైతే నారు తీసి, నాట్లు వేసేందుకు ఎకరాకు కిరాయిగా రూ.3,200 నుంచి రూ.4 వేలు తీసుకుంటున్నారు. వీరు వరినాట్లు వేసే విధానం ఒక క్రమపద్ధతిలో ఉంటూ, దిగుబడులు పెరగడానికి తోడ్పడుతుందని రైతులు నమ్ముతున్నారు. దీనితో కిరాయి ఎక్కువైనా వారితోనే నాట్లు వేయించేందుకు చాలామంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని మూడు మండలాలలో 16,698 హెక్టార్లు సాగు విస్తీర్ణం లక్ష్యంగా కాగా ఇంతవరకూ 4,479 హెక్టార్లలో నాట్లు వేశారు. నెలాఖరుకు మిగిలిన ప్రాంతాలలో కూడా నాట్లు వేయడం పూర్తి కావొచ్చని అధికారులు భావిస్తున్నారు. దానికి అనుగుణంగా ఎత్తిపోతల పథకాల ద్వారా గోదావరి జలాలను విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే తొర్రిగెడ్డ, పుష్కర వంటి పథకాల ద్వారా నీటిని విడుదల చేశారు.

మండలాల వారీగా పరిశీలిస్తే రాజానగరంలో 4,983 హెక్టార్లుకు 1,250, కోరుకొండలో 6,046కు 465, సీతానగరంలో 5,669కు 2,764 హెక్టార్లలో వరినాట్లు వేశారు. వీటిలో తక్కువ కాలవ్యవధితో కూడిన ఎంటీయూ 7029 (స్వర్ణ), సంపత్‌ స్వర్ణ వరి వంగడాలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు.

నెలాఖరుకు పూర్తి కావొచ్చు

నరేంద్రపురం, కలవచర్ల, తూర్పుగానుగూడెం, వెలుగుబంద ప్రాంతాలలో భూగర్భ జలాలను వినియోగించి వరినాట్లు వేయడం దాదాపు పూర్తి కావొచ్చింది. మిగిలిన ప్రాంతాలలో నారు సేకరణలో రైతులు బిజీగా ఉన్నారు. నెలాఖరునాటికి పూర్తయ్యే అవకాశం ఉంది.

– కల్యాణ్‌ సూర్య కుమార్‌, మండల వ్యవసాయాధికారి, రాజానగరం

శాస్త్రీయ పద్ధతిలో సాగు చేయాలి

సార్వా సీజన్‌లో వరిసాగును శాస్త్రీయ పద్ధతిలో చేసి, మంచి దిగుబడులు పొందాలని రైతులకు సూచించాం. నరేంద్రపురం, వెలుగుబంద, దోసకాయలపల్లి, కోటి కేశవరాల్లో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి విత్తన శుద్ధి, నారుమడి యాజమాన్యం, జింకు లోప నివారణ చర్యలు, ఎరువులు, పురుగు మందుల వాడకం తదితర వాటిపై అవగాహన కల్పించాం.

– డాక్టర్‌ చల్లా వీర వెంకట నరసింహరావు, జిల్లా ఏరువాక కేంద్రం, దివాన్‌ చెరువు

శాకంబరి.. నమోస్తుతే..



చంద్రేడులో శాకంబరిగా దుర్గాదేవి



శాకంబరిగా అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కొలువైన దుర్గాదేవిని శుక్రవారం శాకంబరిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా.. అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో శనివారం సాంబారు తయారు చేసి అమ్మవారి ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేస్తామని అర్చకుడు మైల వరపు కృష్ణ తెలిపారు.

అనపర్తిలో..

అనపర్తి: అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాడమాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారిని సుమారు 510 కిలోల కూరగాయలు, ఆకుకూరలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి భారీగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది.

గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి



కాండ్రేగుల గ్రామంలో క్లాప్‌ మిత్రతో మాట్లాడుతున్న డీపీఓ రవికుమార్‌

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చి, ప్రజారోగ్యాన్ని పరిరక్షించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్‌ అన్నారు. కాండ్రేగుల, శహపురం గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. క్లాప్‌ మిత్రలు ఏ విధంగా తడి, పొడి చెత్త సేకరిస్తున్నారు, ప్రజలు ఎలా అందిస్తున్నారనే విషయాలను తెలుసుకున్నారు. కాండ్రేగుల గ్రామంలో ఇంతకు ముందు డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి శానిటేషన్‌ క్లాప్‌ మిత్రలను తీసుకుని తడి, పొడిచెత్త విడివిడిగా ఇవ్వడానికి మహిళలతో ఐఈసీ యాక్టివిటీ చేస్తుండగా, దాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆ గ్రామాల్లో తాగునీటి రక్షిత పథకాలను సందర్శించి క్లోరినేషన్‌ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి చంద్రకళ, సర్పంచులు కుడిపూడి వీర వెంకట సత్యనారాయణ, వనుం శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలైతే జీవితం నాశనం



వికాస్‌ కాలేజీలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోలీసు అధికారులు

కోరుకొండ: మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం నాశనం అవుతుందని రాజమహేంద్రవరం నార్త్‌ జోన్‌ డీఎస్పీ వై.శ్రీకాంత్‌ అన్నారు. మధురపూడి విమానాశ్రయం సమీపంలోని వికాస్‌ ఫార్మసీ కాలేజీలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషధ విద్య దేశానికి భవిష్యత్తు అని, విద్యార్థులు మరింత శ్రద్ధగా విద్యాభ్యాసం చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌ తదితర మత్తుపదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారమవుతుందని హెచ్చరించారు. ఈస్ట్‌జోన్‌ డీఎస్పీ విద్య మాట్లాడుతూ మహిళల భద్రత, సంరక్షణకు పోలీసులు చాలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఎన్నో చట్టాలున్నప్పటికీ కొన్ని సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోరుకొండ సీఐ సత్యకిశోర్‌, ఈగల్‌ విభాగం సీఐ మోహనరావు, వికాస్‌ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌ జి.సుమలత, కేజేఆర్‌ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌ ప్రీతి ప్రియదర్శిని పాల్గొన్నారు.

దాడి ఘటనలో నిందితులకే పోలీసుల సహకారం?



అనపర్తిలో విలేకరులతో మాట్లాడుతున్న ఉదయ కుమార్‌

అనపర్తి: దుప్పలపూడి దళిత మహిళపై జరిగిన దాడి ఘటనలో నిందితులకే పోలీసులు సహకరిస్తున్నట్టు అనిపిస్తోందని మాదిగ న్యాయవాదుల సమాఖ్య రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండేపూడి ఉదయ కుమార్‌ ఆరోపించారు. అనపర్తి ప్రెస్‌ క్లబ్‌లో గురువారం రాత్రి మాదిగ న్యాయవాదులతో కలసి ఆయన మాట్లాడారు. బాధితులకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు.. నిందితుడు ఎన్వీ, ఆయన అనుచరులకే అనుకూలంగా ఉన్నారని ఆరోపించారు. బాధితురాలే స్వయంగా తనపై జరిగిన దాడిని వివరించినా పట్టించుకోకుండా కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తూ, కేసుకు సంబంధం లేని సెక్షన్లు వేశారన్నారు. రక్షణ కోసం పోలీసులకు విన్నవించుకోవడానికి వెళ్లిన వారు తిరిగి ఇంటికి వస్తుంటే.. వారి కదలికలు రౌడీ మూకలకు ఎలా తెలిశాయని ప్రశ్నించారు. దాడి జరిగి దాదాపు వారం రోజులు కావస్తున్నా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆ మహిళను పరామర్శించకపోవడం చూస్తుంటే దళితులపై వారికున్న చిత్తశుద్ధి అర్థమవుతోందన్నారు. ఎమ్మార్పీఎస్‌ అధ్యక్షుడు మంద కృష్ణ శనివారం విజయవాడ వస్తున్నారని, దుప్పలపూడి ఘటనను ఆయన దృష్టికి తీసుకువెళతానన్నారు. కార్యక్రమంలో జిల్లా మాదిగ న్యాయవాదుల సమాఖ్య నాయకులు, ఎమ్మార్పీఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

సీతానగరం: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సీతానగరంలో పీహెచ్‌సీ డాక్టర్లు ఏవీకే చైతన్య, ఎం.శైలజా రాణి, కె.సునీల్‌, ఏసురాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్‌ సునీల్‌ మాట్లాడుతూ జనాభా నియంత్రణ కోసం ప్రతి కుటుంబంలో ఒక్కరూ లేదా ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండాలన్నారు. బాల్య వివాహాలను నివారించాలని, దంపతులు తాత్కాలిక, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వైఎస్‌ రాయుడు, పీహెచ్‌ఎన్‌ కె.ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్‌ కె.సుధాకర్‌, స్టాఫ్‌ నర్స్‌ బి.బేబీ రమణ పాల్గొన్నారు

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్‌ యూనివర్సిటీ ప్రాంగణంలోని గైట్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ టి.జయానందకుమార్‌ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో మానవ వనరులు ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. హెల్త్‌ సైన్స్‌ విభాగం అధిపతి డాక్టర్‌ శ్వేత ప్రశాంతి మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డీన్‌ డాక్టర్‌ బి. శ్రీనివాసరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదలపై విద్యుత్‌ బిల్లుల భారం

- కూటమి పాలనలో ప్రజల అవస్థలు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: విద్యుత్‌ చార్జీలను విపరీతంగా పెంచి, పేదలపై కూటమి ప్రభుత్వం ఆర్థిక భారం మోపిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు స్మార్ట్‌ మీటర్లను వ్యతిరేకించిన కూటమి నాయకులు.. అధికారం చేజిక్కించుకున్న తర్వాత వాటికి వత్తాసు పలుకుతున్నారన్నారు. ప్రజలపై విద్యుత్‌ బిల్లుల భారం మోపి తీవ్రంగా వేధిస్తున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి ఉచిత కరెంటు ఇవ్వడం ద్వారా రైతులకు మద్దతుగా నిలిచారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ట్రూఅప్‌ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో విపరీతంగా చార్జీలు పెంచడంతో రూ.400 నుంచి రూ.500లు వచ్చే కరెంటు బిల్లు రూ.1000 వరకూ పెరిగిందన్నారు. అంతే కాకుండా స్మార్ట్‌ మీటర్ల రంగప్రవేశంతో వినియోగదారుల నడ్డి విరిగే పరిస్థితి నెలకొందన్నారు. తొలుత ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలకు అమలు చేస్తూ, తర్వాత గృహ వినియోగదారులకు కూడా స్మార్ట్‌ మీటర్లు అమర్చుతారన్నారు. వాటిని సెల్‌ఫోన్‌ రీచార్జి చేసుకున్నట్టు ముందస్తు రీచార్జి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మరో వైపు పీక్‌ అవర్స్‌ అయిన ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు ఎక్కువ చార్జీలు వసూలు చేస్తారన్నారు. స్మార్ట్‌ మీటర్‌ బిగించడానికి వాణిజ్య సముదాయాలకు సుమారు రూ.17 వేలు, గృహ వినియోగదారులకు రూ.7 వేలు ఖర్చు అవుతుందన్నారు, అదీ కూడా విడతల వారిగా వినియోగదారుడే చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజానగరం: వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను రైతులు ఆకళింపు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌.మాధవరావు అన్నారు. సాగులో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి సాగును చేపట్టాలన్నారు. ఫలితంగా అధిక దిగుబడులు సాధించడంతోపాటు సంపూర్ణ పోషకాలు లభించే పంటలను పండించవచ్చని సూచించారు. మండలంలోని శ్రీకృష్ణపట్నంలో చెల్లుబోయిన మూర్తి అనే యువ రైతు ప్రకృతి సాగులో చేపట్టిన వ్యవసాయ క్షేత్రాన్ని (పండ్ల తోట) ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులతో కలసి శుక్రవారం ఆయన సందర్శించారు. ఆ క్షేత్రంలో 30 రకాల పీఎండీఎస్‌ నవధాన్యాల విత్తనాలను డ్రోన్‌ ద్వారా వెదజల్లించి, సాగులో టెక్నాలజీ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ విత్తనాలు మొలిచిన 45 రోజుల తరువాత దుక్కి చేయడం ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఇవి భూమిలో కార్బన్‌ డయాక్సైడ్‌, నైట్రోజన్‌ వంటి ప్రకృతి సిద్ధమైన ఎరువులుగా మారి పంటకు పోషకాలను అందిస్తాయన్నారు. వ్యవసాయ డ్రోన్లకు రూ.10 లక్షల వరకు 80 శాతం సబ్సిడీ రుణాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం మేనేజర్‌ బి.తాతారావు, ఏడీ పీఎం వల్లీ, ఏపీ రైతు సాధికారత సంస్థ రాష్ట్ర అకాడమీ లీడ్‌ సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ పామ్‌ సాగుపై రైతులకు సదస్సు



ఆయిల్‌ పామ్‌ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీతానగరం: ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్స్‌ లిమిటెడ్‌ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్‌ సాగుపై మిర్తిపాడులో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవనశాఖాధికారి పి.రిని, పతంజలి ఫుడ్స్‌ లిమిటెడ్‌ డీజీఎం ప్రకాష్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌వో రిని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న వివిధ రకాల ప్రోత్సాహకాలను వివరించారు. సూక్ష్మ సేద్యంలో అందిస్తున్న రాయితీలను తెలిపారు. డ్రిప్‌ ఇరిగేషన్‌కు 90 శాతం సబ్సిడీ ఇస్తున్నారన్నారు. పతంజలి ఫుడ్స్‌ లిమిటెడ్‌ డీజీఎం ప్రకాష్‌ మాట్లాడుతూ ఆయిల్‌పామ్‌ సాగులో కొత్త విధానాలను అవలంబించడం ద్వారా మండలంలోని రైతులు అత్యధిక ఆదాయం పొందుతున్నారన్నారు. ఇక్కడ సారవంతమైన నేలలు ఆ పంటకు అత్యంత అనుకూలంగా ఉంటాయన్నారు. రైతులకు కంపెనీ ద్వారా అందించే సేవలు, సదుపాయాలు, పంట సాగులో ఎరువుల యాజమాన్యం, సాగులో విజయం సాధించిన రైతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ రామకృష్ణ, హెచ్‌ఈవో పీహెచ్‌ సౌమిత్రి, వీహెచ్‌ఏ వై.నందిని, పతంజలి ఫుడ్స్‌ లిమిటెడ్‌ సీనియర్‌ ఫీల్డ్‌ ఆఫీసర్‌ డీఎస్‌ శ్రీనివాస్‌, ఫీల్డ్‌ ఆఫీసర్‌ కె.కార్తీక రెడ్డి, క్లస్టర్‌ ఇన్‌చార్జి ఎం.నాగేశ్వరరావు, ఫీల్డ్‌ సూపర్‌వైజర్‌ పి.శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

గామన్‌ రహదారిపై కలకలం

- ఆవును ఢీకొన్న వ్యాన్‌
- బైక్‌పై వస్తున్న ఇద్దరికి గాయాలు
- వ్యాన్‌ నుంచి రోడ్డుపై పడిన మొలాసిస్‌
- దాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బందిని ఢీకొన్న కంటైనర్‌



డివైడర్‌పైకి దూసుకుపోయిన కంటైనర్‌, ఘటనా స్థలంలో నిలిచిన వాహనాలు

రాజానగరం: దివాన్‌ చెరువు నుంచి కొవ్వూరు వెళ్లే గామన్‌ బ్రిడ్జి రహదారిపై శుక్రవారం ప్రమాదాలతో కలకలం రేగింది. ముందుగా కొవ్వూరు వెళుతున్న వ్యాన్‌ ఆ దారిలోని కేశవ్‌ ఆస్పత్రి సమీపంలో ఒక ఆవును ఢీకొంది. దీంతో వ్యాన్‌ డివైడర్‌పై నుంచి అవతలి వైపునకు దూసుకుపోయింది. అదే సమయంలో కొవ్వూరు వైపు నుంచి బైకుపై వస్తున్న ఇద్దరిని ఢీకొని తిరగబడింది. ఈ సంఘటనలో బైక్‌పై వస్తున్న వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. దివాన్‌ చెరువులోని జంగాల కాలనీలో గోతిలో పడి కడమంచిలి శ్రీను (4) అనే బాలుడు మృతి చెందాడు. ఆ విషయం తెలియడంతో అతడి అమ్మమ్మ, మేనమామ బైకుపై వస్తుండగా ఈ ప్రమాదానికి గురయ్యారు. వెంటనే వారిని చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదంలో తిరగబడిన వ్యాన్‌ నుంచి మొలాసిస్‌ (చెరకు నుంచి వచ్చే మడ్డి) రహదారిపై చెల్లాచెదురుగా పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీనితో హైవే పోలీసులు ట్రాఫిక్‌ను కంట్రోల్‌ చేసే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అటుగా కంటైనర్‌ వేగంగా వెళుతూ, రోడ్డుకు అడ్డుగా పెట్టిన స్టాపర్లతోపాటు రహదారిపై మొలాసిస్‌ని క్లీనింగ్‌ చేస్తున్న సిబ్బందిని ఢీకొంది. అలాగే డివైడర్‌ను దాటుకుని ట్రాఫిక్‌ కంట్రోల్‌ చేసే పనిలో ఉన్న క్రేన్‌ను కూడా ఢీకొనడంతో, దాన్ని ఆపరేట్‌ చేస్తున్న వీరబాబు కిందపడ్డాడు. కంటైనర్‌ డివైడర్‌ ఎక్కి ఆగడంతో అతడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహం



శ్రావ్య వర్షితకు రూ.20 వేల చెక్కు అందజేస్తున్న సర్పంచ్‌ సత్తి వీరమణి

బిక్కవోలు: ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన రెడ్డి శ్రావ్య వర్షితకు హైదరాబాద్‌ చెందిన మాదిరెడ్డి జగన్నాథరావు నాయుడు ట్రస్ట్‌ రూ.20 వేల నగదు ప్రోత్సాహం అందించింది. ఈ మేరకు శుక్రవారం కొంకుదురు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ విద్యార్థినికి సర్పంచ్‌ సత్తి వీరమణి, సొసైటీ మాజీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, కొమరిపాలెం డీసీ చైర్మన్‌ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి చెక్కు అందించారు. వారు మాట్లాడుతూ చదువుతోనే భవిష్యత్తు మెరుగవుతుందన్నారు. శ్రావ్య వర్షితను ప్రోత్సహించిన ఉపాధ్యాయురాలు మాసవరపు శిరిష, మణికంఠ దంపతులను అభినందించారు. కార్యక్రమంలోని హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

అనపర్తి: మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవడానికి జిల్లా కోర్టుకు వెళ్లనవసరం లేదని, అనపర్తిలోని జూనియర్‌ సివిల్‌ కోర్టులోనే ఆ అవకాశం ఉందని అనపర్తి జూనియర్‌ సివిల్‌ కోర్టు న్యాయమూర్తి వంశీకృష్ణ అన్నారు. ఆయన శుక్రవారం కోర్టు ఆవరణలో 'దేశం కోసం మధ్యవర్తిత్వం' అవగాహన వారోత్సవాలను ప్రారంభించారు. న్యాయమూర్తి వంశీ మాట్లాడుతు ప్రస్తుత సమాజంలో కోర్టు కేసులు త్వరగా పరిష్కరించుకోవడం కోసం మధ్యవర్తిత్వానికి చాలా ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. అనపర్తి కోర్టులో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కారం చేసుకోవడానికి ప్రత్యేకంగా ఇద్దరు న్యాయవాదులను నియమించామన్నారు. 90 రోజుల పాటు నిర్వహించే మధ్యవర్తిత్వాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సారా విక్రేత అరెస్టు

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడి గ్రామంలో గల సారా స్థావరాలపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఆ గ్రామ శివారున సారా విక్రయిస్తున్న జగన్నాథం ఏడుకొండలును అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఏడుకొండలుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్టు ఎస్‌ఐ శివ ప్రసాద్‌ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రంగంపేట: గడ్డిమందు పిచికారీ చేస్తుండగా అస్వస్థతకు గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఏఎస్‌ఐ వీవీ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రంగంపేట గ్రామానికి చెందిన చెక్కపల్లి వీర వెంకట దుర్గారావు ఈ నెల 9వ తేదీన తన పొలంలో గడ్డిమందు పిచికారీ చేశారు. ఆ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోలేదు. దీంతో సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్సకోసం కాకినాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 10వ తేదీ రాత్రి ఎనిమిదిన్నర గంటలకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి చనిపోయినట్టు తెలిపారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటాకిల్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన తాటాకిల్లు

సీతానగరం: మండలంలోని సింగవరంలో ములగ అప్పలరాజుకు చెందిన తాటాకిల్లు శుక్రవారం దగ్ధమైంది. అప్పలరాజు తన భార్యతో కలసి గ్రామంలోని అల్లుడి ఇంటి దగ్గరలో గల తాటాకిల్లులో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పాకలోని గ్యాస్‌ సిలిండర్‌ పేలిపోవడంతో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో లోపల ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసింది. ఈ ప్రమాదంలో ఇంటిలోని ఫ్యాన్‌, టీవీతో పాటుఆధార్‌, రేషన్‌ కార్డులు, మంచాలు, వంట సామగ్రి, రూ 30 వేలు కాలిపోయాయి.

విజేతలకు బహుమతుల ప్రదానం

రాజమహేంద్రవరం రూరల్‌: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బొమ్మూరులోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్‌)లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలలో విజేతలకు శుక్రవారం నగదు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఏఎం జయశ్రీ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. చిత్రలేఖనంలో పులగుర్త జిల్లా ప్రజా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు పావని, రూప ప్రథమ, తృతీయ స్థానాల్లో, శాటిలైట్‌ సిటీ జిల్లా ప్రజా పరిషత్‌ ఉన్నత పాఠశాల ప్లస్‌ విద్యార్థిని సత్య రమ్యశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచారు. వ్యాసరచన పోటీలలో పులగుర్త జిల్లా ప్రజా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థిని కుసుమ ప్రథమ, బొమ్మూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థిని ధనశ్రీ ద్వితీయ, శాటిలైట్‌ సిటీ జిల్లా ప్రజా పరిషత్‌ ఉన్నత పాఠశాల ప్లస్‌ విద్యార్థిని అక్షయ దీపిక తృతీయ స్థానాలను సాధించారు. జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలు, నివారణ చర్యల గురించి ఛాత్రోపాధ్యాయులు, హాజరైన పిల్లలకు చక్కని అవగాహన కలిగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సూర్యనారాయణ, చూడామణి, రాజేష్‌, జిలానీ బాషా పాల్గొన్నారు.